# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 16-05-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్రతో స్వచ్ఛత వైపు అడుగులు వేస్తున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

2. **విభిన్న ప్రతిభావంతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుటుందని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.**

3. **ఉద్యోగాల కల్పనకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి స్పష్టం చేశారు.**

4. **అంతర్జాతీయ కాంతి దినోత్సవం ఈరోజు నిర్వహిస్తున్నారు.**

===========================

స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్రతో స్వచ్ఛత వైపు అడుగులు వేస్తున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో ఆయన ఈరోజు పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా నరసన్నపేటలో నిర్వహించిన 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో పాల్గొని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ప్రజా వేదిక సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ..

వాయిస్..30 సెకన్లు

---------------------------

ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అన్నారు. "స్వర్ణాంధ్ర -- స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా నెల్లూరు నగరంలోని వి.ఆర్.సి గ్రౌండ్ వద్ద ప్లాస్టిక్ నిషేధంపై నిర్వహించిన అవగాహన ర్యాలీని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నందన్‌తో కలిసి ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొని ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం పరేడ్ గ్రౌండ్స్, పోలీస్ క్వార్టర్స్ పరిసరాలలో ఏఆర్ అదనపు ఎస్పీ జి.మునిరాజా ఆధ్వర్యంలో పోలీసులు పరిసరాలను శుభ్రం చేశారు.

---------------------------

విభిన్న ప్రతిభావంతులను కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుటుందని కేంద్ర కమ్యూనికేషన్ శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరులో విభిన్న ప్రతిభావంతులకు కృత్రిమ ఉపకరణాలకు ఆయన ఈరోజు పంపిణీ చేశారు. విభిన్న ప్రతిభావంతులు ప్రభుత్వం నుంచి వచ్చే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొంటూ..

వాయిస్..25 సెకన్లు

----------------------------

ఉద్యోగాల కల్పనకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి స్పష్టం చేశారు. పరిశ్రమలు, పెట్టుబడుల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను భర్తీ చేస్తున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న వెయ్యి 5 వందల 23 అధ్యాపకుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. ఇప్పటికే మెగా డీఎస్సీతో 16 వేల ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేశామన్నారు. బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

----------------------------

తిరుపతి జిల్లా ఏర్పేడులోని భారతీయ సాంకేతిక విజ్ఞాన సంస్థలో యువ సంగం ఫేజ్-6 ఏక్ భారత్ శ్రేష్ట్ భారత్ కార్యక్రమాన్ని తిరుపతి జిల్లా కలెక్టర్ .ఎస్.వెంకటేశ్వర్ ఈరోజు ప్రారంభించారు. విద్యార్థుల్లో మేథోసంపత్తిని పెంచే ప్రయత్నంలో భాగంగా కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేటి నుంచి ఈనెల 27వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరగనుందని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పేర్కొంటూ..

వాయిస్..30 సెకన్లు

----------------------------

కాకినాడ జిల్లాలో ఈరోజు ఉదయం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఉపాధి పనులకు వెళ్తున్న కూలీలు కొవ్వూరు బ్రిడ్జి వద్ద రోడ్డు దాటుతుండగా టిప్పర్ ఢీకొని నలుగురు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో మృతి చెందిన వారిగా గుర్తించారు. ఈ ఘటనపై ఉప ముఖ్యమంత్రి కే. పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేష్, వాసంశెట్టి సుభాష్, నారాయణ, మండిపల్లి రాం ప్రసాద్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని మంత్రులు హామీ ఇచ్చారు.

----------------------------

మన దైనందిన జీవితంలో కాంతి నిర్వహిస్తున్న పాత్రను తెలియజేయడం దాని సాంకేతిక పరిజ్ఞానం పట్ల అవగాహన పెంచడం కోసం ఈరోజు అంతర్జాతీయ కాంతి దినోత్సవం నిర్వహిస్తున్నారు. అమెరికాకు చెందిన భౌతిక శాస్త్రవేత్త థియోడర్ మైమన్ 1960 వ సంవత్సరం మే 16 వ తేదీన మొదటిసారిగా లేజర్ ద్వారా కాంతి పుంజాన్ని ఆవిష్కరించారు. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా ఇదే రోజున అంతర్జాతీయ కాంతి దినోత్సవాన్ని నిర్వహించాలని ఐక్య రాజ్య సమితి పిలుపు నిచ్చింది. థియోడర్ మైమన్ చేసిన ఈ ఆవిష్కరణ వైద్య, రోగ నిర్ధారణ సాంకేతికతల ఆవిష్కరణకు దోహదం చేసింది. కాంతిని మనం సక్రమ రీతిలో వినియోగించుకోగలిగితే పర్యావరణ సమతుల్యానికి కూడా మేలు చేస్తుంది.

---------------------------

ఇంధనం ఆదాతో ఆర్థికంగా లాభంతో పాటు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావొచ్చని ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు. విజయవాడ నగరంలోని క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ఆయన ఎలక్ట్రికల్ సైకిల్‌పై ఈరోజు వెళ్లారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల నేపథ్యంలో ఖర్చులను నియంత్రిస్తూ, అందుబాటులో ఉన్న వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. ఇందులో భాగంగా డీజిల్, పెట్రోలు వాహనాలకు బదులు ఎలక్ట్రిక్ వాహనాలు వినియోగంచాలని కలెక్టర్ జి.లక్ష్మీశ తెలియజేస్తూ..

వాయిస్..25 సెకన్లు

---------------------------

వీధి కుక్కలకు స్టెరిలైజేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని పురపాలక, పట్టాణభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్లు, ఉన్నతాధికారులతో అమరావతి నుంచి మంత్రి టెలీకాన్ఫరెన్స్ ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశాఖపట్నంలో బాలుడిని కుక్క కరిచిన ఘటనపై మంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాలుడికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని విశాఖ మున్సిపల్ కమిషనర్‌కు నారాయణ ఆదేశాలు జారీ చేశారు. సుప్రీం కోర్టు నిబంధనల ప్రకారం పట్టణాలకు దూరంగా కుక్కలకు ఫుడ్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్రంలో ఉన్న 3 లక్షల 20 వేల వీధి కుక్కలకు గాను ఇప్పటి వరకు లక్ష 80 వేల కుక్కలకు శస్త్రచికిత్సలు పూర్తయినట్లు అధికారులు మంత్రికి తెలిపారు.

---------------------------

ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల హాల్‌టికెట్లు జారీ చేసినట్లు ఇంటర్మీడియట్ విద్యామండలి కార్యదర్శి రంజిత్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. మన మిత్ర వాట్సప్ నంబరు 9552300009, అధికారిక బోర్డు వెబ్ పోర్టల్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని విద్యార్థులకు సూచించారు. డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్లపై కళాశాల ప్రిన్సిపాల్ సంతకం అవసరం లేదని స్పష్టం చేశారు. ఈనెల 21వ తేదీ నుంచి సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయని వెల్లడించారు.

---------------------------

రాష్ట్రంలో 22ఏ భూముల సమస్యల పరిష్కారంలో ఏలూరు జిల్లా ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహన్ పేర్కొన్నారు. ఏలూరు కలెక్టరేట్‌లో నిన్న నిర్వహించిన 22ఏ భూముల పరిష్కార మేళాలో పాల్గొన్న మంత్రి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో 290 దరఖాస్తులకు సంబంధించిన 74 ఎకరాలను 22ఏ జాబితా నుంచి తొలగించి రైతులకు పత్రాలు అందజేశారు. మరో 202 దరఖాస్తులను 15 రోజుల్లో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

=====================